1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ

RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers

సంపుటి : 2 సంచిక : 203 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 18 జూన్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 203 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 18 June 2025 PAGES : 8 PRICE : 3/-

## అక్టోబరు 2 నాటికి ఏపీలో

# ప్లాస్టిక్ రహిత నగరాలు

- రాష్ట్రంలో ప్లాస్టిక్ నిర్మూలనకు సీఎం చంద్రబాబు శ్రీకారం
- నాలుగు ప్రధాన నగరాలతో పాటు 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం
- రెండు నెలల్లో సర్క్యులర్ ఎకానమీ తుది పాలసీ రూపకల్పన
- ఏడాదిలోగా మూడు ప్రాంతాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కుల ఏర్పాటు
- వ్యర్థాల నిర్వహణలో ఉత్తమ ప్రతిభకు 'స్వచ్ఛత' అవార్డులు



(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 17)

రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా నగరాలను ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు గట్టి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది అక్టోబర్ 2వ తేదీ నాటికి విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి నగరాలతో పాటు మరో 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ సంచుల వినియోగాన్ని విరివిగా ప్రోత్సహించాలని సూచించారు.

**ప్లాస్టిక్ నిర్మూలనకు పటిష్ట చర్యలు :** మంగళవారం సచివాలయంలో సర్క్యులర్ ఎకానమీపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి ఈ ఆదేశాలు జారీ చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యను అధిగమించేందుకు 87 పట్టణ ప్రాంతాల్లో 157 రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని, రీసైక్లింగ్ మరియు చెత్తను వేరు చేయడంపై 90 రోజుల్లోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని ఆదేశించారు.

**స్వచ్ఛత అవార్డులతో ప్రోత్సాహం :** వ్యర్థాల నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి ప్రోత్సాహకంగా వచ్చే ఏడాది అక్టోబర్ 2 నుంచి 'స్వచ్ఛత' అవార్డులను అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. స్థానిక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీలు, పాఠశాలలు-కళాశాలలు, బస్టాండ్లు, ఆసుపత్రులు, ఎన్జీవోలు, వివిధ సంస్థల వారీగా ఈ అవార్డులను అందజేయాలని నిర్దేశించారు.

**సర్క్యులర్ ఎకానమీకి పెద్దపీట :** రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు, వ్యర్థాల నుంచి సంపద సృష్టించే లక్ష్యంతో రెండు నెలల్లోగా సర్క్యులర్ ఎకానమీకి సంబంధించిన తుది పాలసీని తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా, ఏడాదిలోగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. మొదటి దశలో విశాఖపట్నంలో 400 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న పార్కును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని, ఇందుకుగాను వివిధ దేశాల్లోని విజయవంతమైన పార్కులను అధ్యయనం చేయాలని సూచించారు. ఈ పార్కుల ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు ఆకర్షించేలా చూడాలన్నారు. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లలో ఆధునిక -మిగతా 2లో

## విపత్తు నిర్వహణలో గ్లోబల్ లీడర్‌గా భారత్

### - అమిత్ షా వెల్లడి

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 17)

జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డీఎంఏ), జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) అద్భుత సేవల కారణంగా విపత్తు నిర్వహణ రంగంలో ప్రపంచంలోనే భారత దేశం అగ్ర గామిగా నిలిచిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. పదేళ్ల కిందట విపత్తు దళాలు.. అతి తక్కువ



ప్రాణ నష్టం లక్ష్యంగా పని చేశాయని, ఇప్పుడు ప్రాణ నష్టం అసలే లేకుండా చూసే లక్ష్యంతో పని చేస్తున్నాయని తెలిపారు. సోమవారం ఆయన అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పునరావాస కమిషనర్లు, విపత్తు నిర్వహణ దళాల అధికారుల సమావేశంలో మాట్లాడారు. మోదీ హయాంలోని పదేళ్లలో సామర్థ్యం, కార్యదక్షత, వేగం, కచ్చితత్వంలో గణనీయ లక్ష్యాలను సాధించామని తెలిపారు. పునరావాస కమిషనర్లు.. 90 రోజుల్లోగా జిల్లాల విపత్తు నిర్వహణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. లేకుంటే విపత్తుల సమయంలో వేగంగా స్పందించే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రాలు, కేంద్ర విపత్తు నిర్వహణ దళాలకు మోదీ హయాంలో కేటాయింపులను 3 రెట్లకు పెంచామని తెలిపారు. ఇది దాదాపు రూ.2 లక్షల కోట్లుగా ఉందని వెల్లడించారు.

## జగన్ ను నమ్మితే సర్వనాశనం

### ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 17)

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ రేపు పల్నాడు జిల్లా సత్తెనపల్లి పర్యటనకు వస్తున్నారు. గతేడాది ఆత్మహత్య చేసుకున్న వైసీపీ నాయకుడు నాగమల్లేశ్వరరావు విగ్రహావిష్కరణ చేయనున్నారు. ఈ పర్యటన రాజకీయంగా తీవ్ర ఉత్కంఠ కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో, జగన్ పర్యటనపై సత్తెనపల్లి టీడీపీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఘాటుగా స్పందించారు. జగన్ ను నమ్మి ఆయన కుటుంబ సభ్యులతో పాటు ఎంతో మంది సర్వనాశనమయ్యారని తీవ్రస్థాయిలో విమర్శించారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి మున్సిపాలిటీకి చెందిన నలుగురు వైసీపీ కౌన్సిలర్లు నేడు టీడీపీలో చేరారు. జగన్ పల్నాడు జిల్లా పర్యటనకు కేవలం ఒక రోజు ముందు వైసీపీకి చెందిన కౌన్సిలర్లు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కన్నా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.




"జగన్ ఇచ్చిన తప్పుడు సర్వే రిపోర్టుల కారణంగానే నాగమల్లేశ్వరరావు ఎన్నికల బెట్టింగ్‌లో ఏకంగా రూ.10 కోట్లు నష్టపోయారు. అప్పులు -మిగతా 2లో

## కులగణన కోసం రోడ్డెక్కుతాం

### వీహెచ్ హెచ్చరిక

కులగణన కోసం పోరాటం తప్పదన్న వీహెచ్

కేంద్రం జనగణన అంటోంది, కులగణనను పట్టించుకోవట్లేదని విమర్శ

జనగణన వల్ల బీజేపీకే లాభం, బీసీలకు ఉపయోగం లేదన్న హనుమంతరావు

దేశంలో 16 ఏళ్ల తర్వాత జనగణనకు కేంద్రం నోటిఫికేషన్ విడుదల

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 17)

కులగణన చేపట్టాలనే డిమాండ్‌తో అవసరమైతే రోడ్డెక్కి యుద్ధం చేయడానికి కూడా సిద్ధమని తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు సంచలన ప్రకటన చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కేవలం జనగణన గురించి మాట్లాడుతోందని, కులగణన ప్రస్తావన తీసుకురావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. -మిగతా 2లో



## రాత్రి వేళల్లోనే ఇరాన్ క్షిపణి దాడులు ఎందుకు..?

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 17)

ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణ మొదలై దాదాపు ఐదు రోజులైంది. టెహ్రాన్ ముఖ్యంగా టెల్‌అవీవ్‌పై రాత్రి వేళల్లోనే ఎక్కువగా క్షిపణి దాడులు చేయడాన్ని వ్యూహంగా పెట్టుకొంది. ప్రత్యర్థిని గందరగోళం, ఆశ్చర్యం, షాక్‌కు గురిచేయడానికి ఇది బాగానే ఉపయోగపడుతోంది. కానీ, నిశిరాత్రి దాడి చేయడం వెనుక కొన్ని సాంకేతికంగా తప్పనిపరిస్థితులు, మానసిక యుద్ధతంత్రం వంటివి



ఉన్నాయి. ఇజ్రాయెల్ వాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఆ వ్యూహం ఏమిటంటే.. ఇరాన్ వద్ద ఇజ్రాయెల్ దగ్గర ఉన్నటువంటి అత్యాధునిక విమానాలు లేవు. ఉన్నవి కూడా పాత తరం అమెరికా, సోవియట్ రష్యా విమానాలే. ఇవి ఇజ్రాయెల్‌కు చేరాలంటే మాత్రం.. ఇరాక్, సిరియా, సౌదీ, జోర్డాన్, లెబనాన్ తదితర దేశాల్లో కొన్నింటి గగనతలాలపై నుంచి ప్రయాణించాల్సి ఉంటుంది. కానీ, ఆయా దేశాలు చూస్తూ తమ గగనతలాన్ని అమెరికా మిత్రదేశమైన ఇజ్రాయెల్‌పై దాడికి వాడుకోనివ్వవు. ఈ నేపథ్యంలో కచ్చితంగా క్షిపణులను ప్రయోగించాల్సిందే.

**సాంకేతిక ఇబ్బంది..** రాన్ వద్ద ఉన్న క్షిపణుల్లో 2,000 కిలోమీటర్లకు పైబడి రేంజి ఉన్నవి మాత్రమే ఇజ్రాయెల్‌లోని లక్ష్యాలను చేరుకోగలవు. ఇక యుద్ధ విమానాల వలే ఇవి వాతావరణం నుంచి ఆక్సిజన్‌ను -మిగతా 2లో

## ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలి

ధరణి పోర్టల్ వల్ల ప్రతి గ్రామంలో భూ సమస్యలు ఉన్నాయన్న పొంగులేటి

భూ భారతి చట్టం ద్వారా సమస్యలకు పరిష్కారం చూపాలని సూచన

ప్రజాపాలన లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలన్న మంత్రి

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 17)

గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ కారణంగా రాష్ట్రంలోని ప్రతీ గ్రామంలో వందలాది కుటుంబాలు తీవ్ర భూ సమస్యలతో సతమతమవుతున్నాయని, తెలంగాణ సమాజంలో భూమి అత్యంత కీలకమైన అంశమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలన్నింటినీ 'భూ భారతి' చట్టం ద్వారా పరిష్కరించాలని ఆయన జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈరోజు సచివాలయంలో పలువురు నూతన కలెక్టర్లు, అధికారులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. -మిగతా 2లో





## జగన్ సహా 100 మందికే అనుమతి: పల్నాడు జిల్లా ఎస్పీ

పల్నాడు జిల్లా రెంటపాలలో

రేపు వైసీపీ కార్యకర్త విగ్రహావిష్కరణ

కార్యక్రమానికి హాజరుకానున్న జగన్

30 వేల మంది వస్తారని వైసీపీ శ్రేణుల అంచనా

## ఆరోగ్య శాఖపై రూ.6,500 కోట్ల అప్పులు మిగిల్చారు

గత ఐదేళ్ల జగన్ పాలనలో ఆరోగ్య వ్యవస్థ

భ్రష్టుపట్టిందన్న సత్యకుమార్

ఆరోగ్యశ్రీకి రూ.2,500 కోట్లు, మందులకు

రూ.1000 కోట్ల బకాయిలున్నాయని వెల్లడి



## సద్దాం హుస్సేన్‌కు ఏమైందో గుర్తుంచుకోండి .. ఇరాన్‌కు ఇజ్రాయెల్ హెచ్చరిక



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 17)

తమ పౌరులే లక్ష్యంగా దాడులు చేస్తూ ఇరాన్ యుద్ధ నేరాలకు పాల్పడుతోందని ఆరోపిస్తున్న ఇజ్రాయెల్ .. ఇందుకు టెహ్రాన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మరోసారి తీవ్రంగా స్పందించిన ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్.. ఇరాక్ మాజీ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్)కు ఎలాంటి పరిస్థితి ఎదురైందో టెహ్రాన్ పాలకులు గుర్తించుకోవాలని హెచ్చరించారు.

"మా పౌరులపై క్షిపణి దాడులు చేస్తూ యుద్ధ నేరాలకు పాల్పడుతున్న ఇరాన్ పాలకులను హెచ్చరిస్తున్నా. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఇదే మార్గాన్ని ఎంచుకున్న ఇరాక్ నియంతకు (సద్దాం హుస్సేన్) ఏం జరిగిందో గుర్తుంచుకోవాలి" అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ హెచ్చరించారు. ఇరాన్ అధికారిక వార్తా సంస్థ కార్యాలయంపై దాడులను ప్రస్తావించిన ఆయన.. ఇతర సైనిక స్థావరాలపైనా దాడులు కొనసాగిస్తామన్నారు. ఐడీఎఫ్ అధికారులు సూచించిన విధంగా టెహ్రాన్ పౌరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించారు.ఇరాన్ సైనిక స్థావరాలు, చమురు క్షేత్రాలు, అణుశుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటూ ఇజ్రాయెల్ భీకర దాడులు చేస్తున్న వేళ సుప్రీం లీడర్ ఖమేనీని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. -మిగతా 2లో

# అక్టోబరు 2 నాటికి ఏపీలో ప్లాస్టిక్ రహిత నగరాలు

యంత్రాల వినియోగాన్ని పెంచాలని కూడా ఆయన దిశానిర్దేశం చేశారు. 'మెటీరియల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' సమర్పించిన 'సర్క్యులర్ ఎకానమీ పార్కుల' ఏర్పాటు ప్రతిపాదనలను కూడా సీఎం పరిశీలించారు.

11 కీలక రంగాలు, 3 శాఖలపై ప్రత్యేక దృష్టి

సర్క్యులర్ ఎకానమీ కింద కేంద్ర ప్రభుత్వం గుర్తించిన మున్సిపల్, వాహనాలు, లిథియం బ్యాటరీలు, జిప్సం, టైర్లు, రబ్బర్, ఎలక్ట్రానిక్, వ్యవసాయం, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాలు వంటి 11 రంగాలపై ప్రధానంగా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. వీటికి అదనంగా గనులు, చేనేత, పశుసంవర్ధక శాఖలను కూడా కలుపుకుని సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. నగర పాలక సంస్థలు, పంచాయతీల్లో జీరో వేస్ట్ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు.

# జగన్ ను నమ్మితే సర్వనాశనం

ఇచ్చిన వారి నుంచి తీవ్ర అవమానాలు ఎదురవడంతో, తట్టుకోలేక ఆయన 2024 జూన్ 9వ తేదీన ఆత్మహత్య చేసుకున్నారు. అలాంటి వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించడానికి ఇప్పుడు జగన్ రావడం సిగ్గుచేటు" అని కన్నా మండిపడ్డారు.

జగన్ అరాచకాలను ప్రజలు భరించలేకపోయారని, అందుకే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆయన పార్టీని చిత్తుచిత్తుగా ఓడించారని కన్నా గుర్తుచేశారు. "ఇలాంటి అరాచక శక్తులను పరామర్శించడానికి వస్తే, ఈసారి ఆ పార్టీకి 11 సీట్లు కూడా దక్కవు" అని ఆయన హెచ్చరించారు.

# కులగణన కోసం రోడ్డెక్కుతాం

ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ, "కేంద్రం చేపడుతున్న జనగణన వల్ల బీజేపీకి తప్ప మరెవరికీ ప్రయోజనం ఉండదు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలైన బీసీలకు దీనివల్ల ఒరిగేది ఏమీ లేదు" అని అన్నారు. కులగణన ఆవశ్యకతను అన్ని రాజకీయ పార్టీలు గుర్తించి, దానికోసం గళం విప్పాలని ఆయన కోరారు.మరోవైపు, దేశంలో దాదాపు 16 సంవత్సరాల విరామం తర్వాత జరగనున్న జనగణనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ జనగణన ప్రక్రియ రెండు దశల్లో జరగనుంది. దేశ చరిత్రలో ఇది 16వ జనగణన కాగా, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చేపడుతున్న 8వది కావడం గమనార్హం.జనగణన తొలి దశలో భాగంగా హిమాలయ ప్రాంతాలైన జమ్ముకశ్మీర్, లడక్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో 2026 అక్టోబర్ 1వ తేదీ వరకు జనగణన పూర్తి చేయనున్నారు. రెండో దశలో, 2027 మార్చి 1వ తేదీ నాటికి దేశంలోని మిగిలిన అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జనగణన పూర్తి చేయనున్నట్లు కేంద్ర హోం శాఖ స్పష్టం చేసింది. అయితే, ఈ జనగణనలో కులాల వారీగా వివరాలు సేకరిస్తారా లేదా అనే అంశంపై స్పష్టత లేకపోవడంతో వీహెచ్ వంటి నేతలు కులగణన కోసం పట్టుబడుతున్నారు.

# రాత్రి వేళల్లోనే ఇరాన్ క్షిపణి దాడులు ఎందుకు..?

ప్రొపెల్షన్‌లోకి తీసుకోవు. దీనికి తోడు బాలిస్టిక్ క్షిపణలు చేరే ఎత్తులో ఆక్సిజన్ తక్కువగానీ అసలు లేని పరిస్థితిగానీ ఉంటుంది. ఈ నేపథ్యంలో కంబస్టన్ కోసం కచ్చితంగా ఇంధనం, ఆక్సిడైజర్ ఉండి తీరాల్సిందే. దీనిని దృష్టిలో పెట్టుకొని బాలిస్టిక్ క్షిపణులను రెండు రకాలుగా విభజించారు. ఇక ద్రవ ఇంధనంతో పనిచేస్తే.. రెండోది ఘన ఇంధనంతో పనిచేస్తుంది. ఇరాన్ వద్ద 2,000కు పైచిలుకు బాలిస్టిక్ క్షిపణులున్నట్లు ఇజ్రాయెల్ అంచనావేసింది.ఇక ఇరాన్ వద్ద ఉన్న దీర్ఘశ్రేణి షహబ్ క్షిపణుల్లో ద్రవ ఇంధనాన్ని వినియోగిస్తున్నారు. వీటిని ప్రయోగించడానికి మిసైల్‌లో ఇంధనం నింపడం ఓ

## మొదటిపేజీ తరువాయి

కఠిన ప్రక్రియ. రెండు వేర్వేరు ట్యాంకుల్లో ఇంధనం, ఆక్సిడైజర్‌ను నింపాలి. దీనికి కొంత సమయం పట్టడంతోపాటు.. ప్రమాదకరమైన ప్రక్రియ. దీనికి ఒకే చోట ఉండే లాంచ్ఇన్ఫ్రాస్ట్రక్చర్, అదనపు సిబ్బంది అవసరం. ఈ దశలో క్షిపణి శత్రువు ఉపగ్రహాలు, నిఘా విమానాల కంటపడే అవకాశాలు అత్యధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో రాత్రి వేళల్లోనే ఈ ప్రక్రియను చేపడతారు.

ఇక ఇరాన్ వద్ద ఉన్న ఫతేహ్-110, జొల్ఫఘర్ క్షిపణుల్లో ఘన ఇంధనం వినియోగిస్తారు. దీనిలో ఆక్సిడైజర్ కూడా కలిసే ఉంటుంది. దీనిని ఎప్పుడంటే అప్పుడు ప్రయోగించవచ్చు. శత్రువుపై మెరుపుదాడులకు వీటిని వాడతారు. ఈ క్షిపణులను ఒక్కసారి ఇగ్నైట్ చేస్తే ఆపడం సాధ్యం కాదు. ఇరాన్ ద్రవ, ఘన ఇంధన క్షిపణులు కలిపి వాడుతోంది. తమ ప్లాట్‌ఫామ్‌లు, ట్రక్కులు వెంటనే శత్రువు కంటపడకుండా కాపాడుకొంటూ.. ప్రత్యర్థులను దెబ్బతీసి భయపెట్టడమే దాని వ్యూహం.

**మూడో వంతు లాంచర్లను ధ్వంసం చేసిన ఇజ్రాయెల్..**

ఇరాన్ వద్ద ఎన్ని క్షిపణులున్నా.. ప్రయోగించాలంటే లాంచర్లు చాలా అవసరం. అందుకే ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు, డ్రోన్లు వ్యూహాత్మకంగా వాటిపై గురిపెట్టాయి. నిన్నటి వరకు తాము ఉపరితలంపై నుంచి ఉపరితలానికి క్షిపణులు ప్రయోగించే 120 లాంచర్లను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ పేర్కొంది. ఇది ఇరాన్ మొత్తం లాంచర్లలో 3వ వంతుకు సమానమని పేర్కొంది. ఇప్పటికీ దాని వద్ద భారీ సంఖ్యలో క్షిపణలు, లాంచర్లు ఉన్నాయని మిలిటరీ అధికారులు బలంగా నమ్ముతున్నారు. చాలా వరకు పర్వతాలను తొలిచి నిర్మించిన సొరంగాల్లో భద్రపర్చినట్లు భావిస్తున్నారు.

# ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలి

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ధరణి పోర్టల్‌తో తలెత్తిన చిక్కుల వల్ల రైతులు, ప్రజలు పడిన కష్టాలకు చరమగీతం పాడాలన్నారు. 'భూ భారతి', రెవెన్యూ సదస్సుల ద్వారా వస్తున్న దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాబోయే రెండు నెలలు రెవెన్యూ శాఖకు చాలా కీలకమైనవని, భూ సమస్యల పరిష్కారానికి నిర్దేశించిన ఆగస్టు 15వ తేదీ నాటికి చట్టబద్ధమైన అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన మొదలై సుమారు ఏడాదిన్నర కావస్తోందని మంత్రి గుర్తుచేశారు. ఎవరూ ఊహించని రీతిలో భూ సమస్యలను పరిష్కరిస్తూ, సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాల్సిన బృహత్తర బాధ్యత కలెక్టర్లపై ఉందని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా కలెక్టర్లు కూడా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.మంత్రిని కలిసిన వారిలో కొత్తగా నియమితులైన సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, సిద్దిపేట కలెక్టర్ హైమావతి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, నిజామాబాద్ కలెక్టర్ వినయకృష్ణారెడ్డితో పాటు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ స్పెషల్ సెక్రటరీ రాజీవ్‌గాంధీ హనుమంత్ ఉన్నారు.

# సద్దాం హుస్సేన్‌కు ఏమైందో గుర్తుంచుకోండి .. ఇరాన్‌కు ఇజ్రాయెల్ హెచ్చరిక

ఈశాన్య టెహ్రాన్‌లోని ఓ బంకర్‌లో కుటుంబంతో కలిసి ఆయన తలదాచుకున్నట్లు సమాచారం. ఇదిలాఉంటే, ఓ ఫామ్‌హౌస్ అండర్‌గ్రౌండ్‌లో తలదాచుకున్న ఇరాక్ మాజీ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను అమెరికా దళాలు 2003లో పట్టుకున్న సంగతి తెలిసిందే. అనంతరం 2006లో ఆయనకు ఉరిశిక్ష అమలు చేశారు. ఇరాన్‌పై చేస్తున్న దాడులను సమర్థించుకున్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు .. ఇరుదేశాల మధ్య సంఘర్షణను పెంచడం కంటే త్వరగా యుద్ధాన్ని ముగించడమే తమ లక్ష్యమని చెప్పారు. అంతకుముందు ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని చంపేందుకు ఇజ్రాయెల్ పథకం రచించిందని, దీన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తిరస్కరించారనే వార్తలు కూడా వచ్చాయి.

# జగన్ సహా 100 మందికే అనుమతి: పల్నాడు జిల్లా ఎస్పీ

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 17)

పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ మండలం రెంటపాల గ్రామంలో రేపు జరగనున్న వైసీపీ కార్యకర్త నాగ మల్లేశ్వరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆ పార్టీ అధినేత జగన్ హాజరుకానున్నారు. అయితే, ఈ కార్యక్రమానికి భద్రతా కారణాల దృష్ట్యా జగన్ తో సహా కేవలం వంద మందికి మాత్రమే అనుమతి ఇస్తున్నట్లు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు వెల్లడించారు.జగన్ పర్యటనకు అనుమతి కోరుతూ సత్తెనపల్లి వైసీపీ ఇన్‌చార్జి సుధీర్ భార్గవ్ రెడ్డి పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ అభ్యర్థనను పరిశీలించిన అనంతరం ఎస్పీ కంచి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ... విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సుమారు 30 వేల మంది ప్రజలు హాజరవుతారని వైసీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయని ఎస్పీ పేర్కొన్నారు.అయితే, విగ్రహావిష్కరణ జరిగే ప్రదేశానికి కేవలం పది అడుగుల వెడల్పు ఉన్న దారి మాత్రమే ఉందని, ఆ దారికి ఇరువైపులా నివాస గృహాలు ఉన్నాయని ఎస్పీ వివరించారు. ఈ కారణంగా, ఆ ప్రాంతంలో వంద మంది కంటే ఎక్కువ మంది గుమిగూడటానికి అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు. గతంలో రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాల్లో జరిగిన కొన్ని అవాంఛనీయ సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మాజీ సీఎం జగన్ కాన్వాయ్‌తో పాటు అదనంగా మరో మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని ఎస్పీ చెప్పారు.

శాస్త్రీయమైన అంచనాల ప్రకారమే అనుమతులు మంజూరు చేస్తున్నామని, ఒకవేళ నిర్దేశించిన నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఈ సందర్భంగా హెచ్చరించారు. భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకే తాము ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

# ఆరోగ్య శాఖపై రూ.6,500 కోట్ల అప్పులు మిగిల్చారు

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 17)

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలోని ఇతర వ్యవస్థలతో పాటు ఆరోగ్య వ్యవస్థను కూడా పూర్తిగా నిర్వీర్యం చేసి భ్రష్టు పట్టించారని ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించారని, అందుకే ఎన్నికల్లో తగిన తీర్పు ఇచ్చారని ఆయన వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం దివాళా తీసిన ఆర్థిక వ్యవస్థను వారసత్వంగా ఇవ్వడమే కాకుండా, ఆరోగ్య రంగంపై కూడా సుమారు రూ. 6,500 కోట్ల మేర అప్పుల భారాన్ని మోపిందని ఆరోపించారు.గత ప్రభుత్వం మిగిల్చిన అప్పుల గురించి మంత్రి సత్యకుమార్ వివరిస్తూ, "ఆరోగ్యశ్రీ పథకం కింద చెల్లించాల్సిన బకాయిలు రూ. 2,500 కోట్లు, మందుల సరఫరా సంస్థలకు ఇవ్వాల్సినవి రూ. 1,000 కోట్లు ఉన్నాయి. వీటితో పాటు వైద్య కళాశాలల నిర్మాణ పనులకు సంబంధించి రూ. 700 కోట్లు, నాడు-నేడు కార్యక్రమం కింద మరో రూ. 400 కోట్ల అప్పులు కూడా మిగిల్చి వెళ్లారు" అని తెలిపారు. ఇన్ని అప్పులతో ఆరోగ్య వ్యవస్థను గందరగోళంలో పడేశారని ఆయన మండిపడ్డారు.అయితే, తాము అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే వైద్య ఆరోగ్య రంగంలో గణనీయమైన మార్పులు తీసుకువచ్చామని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. "మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, అవసరమైన మానవ వనరుల సిబ్బంది నియామకం చేపట్టడం ద్వారా ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణను బలోపేతం చేశాం. ముఖ్యంగా, జాతీయ ఆరోగ్య మిషన్ (నేషనల్ హెల్త్ మిషన్) కింద రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 రకాల పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయి" అని ఆయన వివరించారు.వివిధ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాల పనితీరును మెచ్చిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రోత్సాహకంగా రూ. 100 కోట్లను విడుదల చేసిందని ఆయన వెల్లడించారు. "కేవలం ఏడాది కాలంలోనే ఆరోగ్య శాఖలో ఇంతటి సానుకూల మార్పును తీసుకురాగలిగాం. శాఖను పూర్తిగా గాడిన పెట్టేందుకు, ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది" అని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు.

# ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 17)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను స్వయం సహాయక సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంభన సాధించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మెప్మా అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం ఒంగోలు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మెప్మా అధికారులతో సమావేశమై జిల్లాలో పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ద్వారా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల అమలును సమీక్షించి దిశానిర్దేశం నిర్దేశం చేశారు. జిల్లాలో 9545 స్వయం సహాయక సంఘాలు, 326 మురికివాడ సంఘాలు మరియు 8 పట్టణ సంఘాలు, 326 మంది రిసోర్స్ పర్సన్స్ స్లమ్ ఫెడరేషన్, పట్టణ సమాఖ్య కింద విధులు నిర్వహిస్తున్నారని, మహిళాకాసం యాప్లో స్వయం సహాయక సంఘాల గురించి సమగ్ర సమాచారాన్ని అప్డేట్ చేస్తున్నట్లు మెప్మా పిడి ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ పేదరిక నిర్మూలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన రెగ్యులర్ లైవ్లి హుడ్ యూనిట్స్ ఆక్షన్ ప్లాన్ 2025-26లో నిర్దేశించిన లక్ష్యాల సాధనలో వంద శాతం లక్ష్యాన్ని సాధించేలా మెప్మా అధికారులు కృషి చేయాలన్నారు. హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్, ఫుడ్, సర్వీస్, ట్రేడింగ్, ఇతర సెక్టార్స్‌లో స్వయం సహాయక సంఘాలకు అవసరమైన మార్కెటింగ్ నైపుణ్యాలలో శిక్షణ, చేయూతనిచ్చి మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి మరింత పటిష్టంగా వ్యాపారం చేసుకునేలా ప్రోత్సహించాల్సి ఉందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధి కార్యకలాపాల మెరుగుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వాహనాలు, స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లు, తృప్తి హోటళ్ళు మొదలైన వినూత్న అవకాశాలను స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుచున్నదన్నారు. ఈ అవకాశాలను స్వయం సహాయక సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంభన సాధించేలా మెప్మా అధికారులు కృషి చేయడంతో పాటు బ్యాంక్ లింకేజి మంజూరు, తృప్తి క్యాంటిన్స్ ఏర్పాటు, స్మార్ట్ స్ట్రీట్స్, టెర్రస్ గార్డెన్, ఈ కామర్స్ ప్రమోషన్ తదితర కార్యక్రమాలకు సంబంధించిన నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం సాధించేలా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్, మెప్మా అధికారులను ఆదేశించారు. ఈ నెల 20వ తేదీన స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఒంగోలు నగరంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగా కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సదరు కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులందరూ కచ్చితంగా ఉదయం 6 గంటలకు హాజరైలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, మెప్మా పిడి ని ఆదేశించారు. ఈ సమావేశంలో మెప్మా పిడి శ్రీహరి, సిఓలు, ఆర్పిలు, తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల అబ్జర్వర్‌గా గోన ప్రతాప్ కుమార్

## అభినందనలు తెలిపిన ఎమ్మార్పీఎస్ నాయకులు జేపీ రాజు మాదిగ

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 17)



కనిగిరి నియోజకవర్గం గుడిపాటి పల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి లాయర్ గోన ప్రతాప్ కుమార్ ను కొండపి నియోజకవర్గం ఎన్నికల అబ్జర్వర్‌గా కనిగిరి చెందిన రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోన ప్రతాప్ కుమార్ ను రాష్ట్ర తెలుగుదేశపార్టీ కమిటీ నియమించింది. నియామకం పట్ల కనిగిరి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు జేపీ రాజు మాదిగ మర్యాదపూర్వకంగా కలిసారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తరపున నియోజకవర్గం దళిత బహుజనులు తరుపున ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కనిగిరి నియోజకవర్గం అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌కి కృతజ్ఞతలు తెలిపారు

# పెట్లూరు, మూగచింతలలో పొలం పిలుస్తోంది



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జూన్ 17)

కొండపి మండలంలోని పెట్లూరు, మూగచింతల గ్రామంలో నందు కొండపి మండల వ్యవసాయాధికారి ఎం మాల్యాద్రి అధ్యక్షతన పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం నందు కొండపి మండలంలో మొత్తం 5875 మంది రైతులు అర్హులుగా ఉన్నారని వీటిలో 180 మంది రైతులకు వివిధ కారణాలతో ఈకేవైసీ అవ్వలేదు అని, రైతులు వారి యొక్క పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్ళి పేర్లు చెక్ చేసుకుని ఈకేవైసీ అవ్వని రైతులు ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని తెలియచేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు 18.06.2025 తేదీ లోపు పెండింగ్‌లో ఉన్న రైతులకు ఈకేవైసీ పూర్తి చెయ్యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పద్మ, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



**మాజీ శివాలయం కమిటీ ఛైర్మన్ కంకణాల రమేష్**
గుండె సంబంధిత వ్యాధితో మృతి
నేడు పొదిలిలో అంత్యక్రియలు

4


షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం


# ప్రణాళికతో పన్ను వసూలుకు చర్యలు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జూన్ 17)

వాణిజ్య పన్నులు ఎగవేతదారుల నుంచి పన్ను వసూలుకు అధికారులు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. వాణిజ్య పన్నులు, అనుబంధశాఖల అధికారులతో జిల్లాస్థాయి సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. చట్టబద్ధంగా వాణిజ్య పన్ను వసూలుపై యంత్రాంగం దృష్టి పెట్టాలని కలెక్టర్ చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.95.14 కోట్లు వాణిజ్య పన్ను వసూలు జరిగిందన్నారు. ప్రస్తుతం గణనీయంగా పన్ను వసూలు తగ్గడంపై ఆరా తీశారు. బాపట్ల జిల్లాలో అత్యధికంగా కాటన్ మిల్లులు, గ్రానైట్ పరిశ్రమ, ఆయిల్ మిల్లులు, ఆక్వా రంగానికి సంబంధించిన పరిశ్రమలపైనే వాణిజ్య పన్నులు అత్యధికంగా వసూలు అవుతున్నాయన్నారు. రూ.50 లక్షలు టర్నోవర్ దాటిన వారంతా కచ్చితంగా జివిస్టి చెల్లించాలన్నారు. వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కరెంట్ అకౌంట్లకు సంబంధించిన బ్యాంకు ఖాతాల వివరాలను వాణిజ్య శాఖకు అందించాలన్నారు. తద్వారా వాణిజ్య పన్నులు వసూలుకు మార్గం సుగమమవుతుందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు, విద్యా సంస్థలు, గ్రామపంచాయతీలు, జిల్లా పరిషత్ జివిస్టి చెల్లిస్తేనే పునరుద్ధరణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం కొనుగోలు చేసే ప్రతి అంశంలోను ఏపీ జీవిస్టీని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా వివిధ నిర్మాణ రంగాల్లో అభివృద్ధి పనులు చేపట్టే గుత్తేదారులు బిల్లులు చేసినప్పుడే పన్ను చెల్లించేలా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రానైట్ పరిశ్రమ నుంచి పన్నుల రూపంలో ప్రభుత్వానికి నష్టం జరుగుతోందని కలెక్టర్ చెప్పారు. గ్రానైట్ క్వారీలు, పరిశ్రమలు, రవాణాలో బోగస్ రిజిస్ట్రేషన్ల ద్వారా పన్నులు వసూలు కావడం లేదని తాజా సర్వేలో వెలుగులోకి వచ్చిందన్నారు. పన్నుల ఎగవేతను అరికట్టడానికి ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. అధికారుల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా అక్రమాలను పూర్తి స్థాయిలో అరికడతామని తెలిపారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా జరిగే భూముల క్రయవిక్రయాలపై స్పష్టమైన వివరాలను నిక్కచ్చిగా వాణిజ్య శాఖకు అనుసంధానించాలన్నారు. తీర ప్రాంతాల్లోని రిసార్ట్స్ నిర్వహణ, ఆర్థిక లావాదేవీలపై పర్యాటకశాఖ, వాణిజ్య పనుల శాఖ సమన్వయంతో పనిచేయాలన్నారు. జీవిస్టీ చెల్లించకుండా గుత్తేదారులు పనిచేస్తున్నట్లు నిర్ధరణ అయితే వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. పన్ను వసూళ్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో వాణిజ్య పన్నులశాఖ సంయుక్త కమిషనర్ బి గీతామాధురి, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, జిల్లా వాణిజ్య పనుల శాఖ అధికారిని ఆర్ శ్రీదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






# దేవాదాయ శాఖకు చెందిన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా దృష్టి సారించాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 17)

దేవాదాయ శాఖకు చెందిన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు వాటి వివరాలను వెబ్ ల్యాండ్‌లో అప్డేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ఒంగోలు కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధ్యక్షతన ఎండోమెంట్ ఆస్తుల పరిరక్షణకు సంబంధించి జిల్లా స్థాయి ఇంటర్ డిపార్ట్మెంటల్ కమిటీ సమావేశమై దేవాదాయ శాఖ కు సంబంధించిన ఆస్తుల పరిరక్షణకు, డేటా ను రెవెన్యూ వెబ్ ల్యాండ్‌లో అప్ డేట్ చేయుటకు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, దేవాదాయ శాఖ అధికారులు అజెండా లో పొందుపరచిన వివిధ దేవాలయాల ఆస్తులను సంబంధిత తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన చేసి తహసీల్దార్ పరిధిలో అవకాశం ఉంటే మ్యుటేషన్ లేదా పేరు మార్పు చేసి వెబ్ ల్యాండ్ లో నమోదు చేయాలని, తహసీల్దార్ పరిధిలో లేకపోతే సమగ్ర సమాచారంతో ప్రతిపాదనలను పై అధికారులకు పంపాలని జిల్లా కలెక్టర్, తహసీల్దార్లను ఆదేశించారు. దేవాదాయ శాఖ కు చెందిన ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్, రెవెన్యూ, దేవాదాయ శాఖల

4

# పీఎంఎఫ్ఎంఈతో వ్యాపారవేత్తలుగా ఎదగాలి

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జూన్ 17)**

ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి జీవనోపాధి(పీఎంఎఫ్ఎంఈ) పథకాన్ని అందిపుచ్చుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. మంగళవారం, వేటపాలెం మండలంలో ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి జీవనోపాధి లబ్ధిదారుల యొక్క యూనిట్లను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పరిశీలించారు. ఈ సందర్భంగా తొలుత ప్రసాద్ నగర్ లోని శ్రీ సాయి తేజ వేరుశెనగ శుద్ధి యూనిట్ ను ఆయన పరిశీలించారు. ఆ యూనిట్ వలన లాభనష్టాలు, వ్యాపార సరళి, ముడి సరుకు కొనుగోలు వివరాలను యూనిట్ యజమానిని అడిగి తెలుసుకున్నారు. తదుపరి కొత్తపేట బాల ఆగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాయి తేజ వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్ స్థాపనకు పి ఎం ఎఫ్ ఎం ఈ పథకము ద్వారా 10 లక్షలు రుణం పొందారని ఆయన తెలిపారు. ఇందులో 35 శాతం సబ్సిడీ కింద వస్తుందన్నారు. ఈ యూనిట్ స్థాపన వలన అక్కడ స్థానికంగా 10 మందికి ఉపాధి కల్పన జరిగిందని ఆయన తెలిపారు. ఆ యూనిట్ యజమానికి వ్యాపారం వలన మంచి లాభాలు వస్తున్నాయని, సంతృప్తికరంగా ఉందని, యూనిట్ విజయవంతంగా కొనసాగుతుందని ఆయన తెలిపారు. బాల ఆగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లో అమ్మ చిల్లి పౌడర్ అనే బ్రాండ్ తో కారం పొడి ఉత్పత్తి జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రస్తుతానికి ఈ యూనిట్లో విద్యుత్ సమస్యల వలన ఉత్పత్తి జరగటం లేదని, ఈ సమస్యలను త్వరలో పరిష్కరించి యూనిట్ పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ యూనిట్ యాజమాన్యానికి భరోసా ఇచ్చారు. పిఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా రుణం పొందిన వారికి 35 శాతం సబ్సిడీ వస్తుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఈ పథకము ద్వారా స్థానికంగా వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ, వాటిని శుద్ధిచేసి ఉపయోగకరమైన ఉత్పత్తులుగా తయారు చేసి వ్యాపారం చేసే ఒక ప్రక్రియ అని ఆయన తెలిపారు. ఈ వ్యాపారం ద్వారా రైతులకు, వ్యాపారులకు లాభం చేకూరుతుందని, ఉపాధి కలుగుతుందని, ఇది ఒక మంచి కార్యక్రమం అని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు ఈ పథకమును మరింత విస్తృతంగా చేయాలనే ఉద్దేశంతో, ఒక అవగాహన కోసం యూనిట్ల పరిశీలన చేయడమైనదని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో యూనిట్ల పరిశీలన చేసి వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యల ను తెలుసుకొని, రాబోవు సమీక్షలో ఆ సమస్యలపై చర్చించి ఈ ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి జీవనోపాధి పథకమును మరింత వేగంగా

4



# వచ్చేది మా ప్రభుత్వమే

## నేరం చేయకపోయినా తప్పుడు కేసులు పెడుతున్నారు

## వైసీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బంది పెట్టే పనిలో టిడిపి ప్రభుత్వం

## రాష్ట్ర అధికార ప్రతినిధి, వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జూన్ 17)

వచ్చేది మా ప్రభుత్వమే నేరం చేయకపోయినా తప్పుడు కేసులు పెట్టి వైసీపీ నాయకులను కార్యకర్తలను ఇబ్బంది పెట్టే పనిలో టిడిపి ప్రభుత్వం పడిందని రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని రాజంపల్లి గ్రామ సమీపంలో వెలిసిన గొడ్రాలి కొండ తిరుమలనాథ స్వామి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన వైయస్సార్సీపీ నాయకులు ఎక్స్ ఎంపీపీ ఏరువా చిన్న కోటి రెడ్డి. మండల యువ నాయకులు ఎరువా సేశ సేనా రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ ప్రభుపై ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం దాటినప్పటికీ నేటికీ ఇచ్చిన హామీల్లో ఒకటి అమలు చేయలేదన్నారు. తల్లికి వందనం పథకం ఇచ్చినప్పటికీ ప్రభుత్వం ప్రతి లబ్ధిదారుల నుంచి 2000 కోత విధించిందన్నారు ఈ డబ్బులు అన్ని చంద్రబాబు అకౌంట్ లోకి నారా లోకేష్ అకౌంట్లోకి వెళ్లాయా అన్నది తెలియాల్సి ఉంది. తల్లికి వందనం డబ్బులు ఇచ్చినప్పటికీ తల్లుల ఖాతాలో చాలామందికి డబ్బులు జమ కాలేదని సచివాలయాల చుట్టూ బారులు తీరుతున్నారు.అయినప్పటికీ వారి సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వైసీపీ నాయకులు కార్యకర్తల మీద ఎన్ని ప్రలోభాలు పెట్టిన భయపడే ప్రసక్తే లేదన్నారు. నాయకులు కార్యకర్తల మీద రెడ్ బుక్ పరిపాలన చేస్తుంది అన్నారు. ప్రజలకు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలం వే ల్లపుచ్చుకుంటుందన్నారు. (తరువాయి 4లో...)

# పీఎంఎఫ్ఎంఈతో వ్యాపారవేత్తలుగా ఎదగాలి

ముందుకు తీసుకువెళ్తామని జిల్లా కలెక్టర్ అన్నారు. పిఎంఎఫ్ఎంఈ పథకము ద్వారా ఆహార శుద్ధి వ్యాపారానికి ఆధునిక సాంకేతికత జోడించి, వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కించాలని, వ్యాపారంలో అన్ని విధాల తోడ్పడి సంఘటిత రంగాలలో పెద్ద వ్యాపారస్తులుగా తయారు చేయాలనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. ఆహార శుద్ధి వ్యాపార రంగంపై ఆసక్తి ఉన్న వారు పిఎంఎఫ్ఎంఈఏపి.ఓఆర్జి అనే వెబ్ సైట్ గాని లేదా సంబంధిత జిల్లా రిసోర్స్ పర్సన్ ఎం.శ్రావణి ఫోన్ నెంబర్ 9381155919 ద్వారా సంప్రదించి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఖలీం, పిడి డిఆర్డిఏ శ్రీనివాసరావు, చీరాల జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్, చీరాల తహసిల్దార్ గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.









# దేవాదాయ శాఖకు చెందిన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా దృష్టి సారించాలి



అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు, కనిగిరి ఆర్డిఓ లు లక్ష్మీ ప్రసన్న, కేశవర్ధన్ రెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ పానకాల రావు, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ శివాలయం కమిటీ ఛైర్మన్ కంకణాల రమేష్

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 17)

మాజీ శివాలయం కమిటీ ఛైర్మన్, ఆర్యవైశ్య సంఘం ట్రెజరర్, కాంట్రాక్టర్ కంకణాల రమేష్ మంగళవారం తెల్లవారుజామున చెన్నైలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో గుండె సంబంధిత చికిత్స పొందుతూ మృతి చెందారు. గత 20 రోజులుగా చెన్నైలోని ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. మంగళవారం తెల్లవారుజామున బిపి డౌన్ అయి శ్వాస అందక ఆయన చనిపోయినట్లు వైద్యులు చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు. పొదిలి పట్టణంలో ప్రతి ఒక్కరికీ ఆయన సుపరిచితులు. మంచి వ్యక్తి... సేవా కార్యక్రమాల్లో ముందుండేవారు. ఆయన మృతి ఆర్యవైశ్య సంఘానికి తీరని లోటని ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. బుధవారం ఉదయం పొదిలి లోని కాలేజీ రోడ్డులో గల ఆయన నివాసం వద్ద నుంచి అంత్యక్రియలు జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# వచ్చేది మా ప్రభుత్వమే







ఈ సందర్భంగా ప్రతి ఏటా ఈ తిరుణాలను అంగరంగ వైభవంగా జరుపుకోవాలని తిరుమల స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి ఏరువ చలమారెడ్డి. సర్పంచులు వెన్న శివకృష్ణారెడ్డి, తోకల ఆవులయ్య యాదవ్, రామాంజనేయరెడ్డి, గుడ్డే పోగు రమేష్, కంచర్ల సుబ్బయ్య గౌడ్, బెజవాడ ఆదాము, నాయకులు దుద్యాల వెంకటరెడ్డి, గుండారెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, ఏలూరు నారాయణరెడ్డి, వజ్రాల ఆదిరెడ్డి, బుజ్జి, మూల సత్యంరెడ్డి, కన్వీనర్లు గంటా రమణారెడ్డి, ముసలారెడ్డి, గడ్డం సుబ్బయ్య, సర్పంచ్ సత్తిరెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాములపాడు, ఈగలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 17)

మండలంలోని పాములపాడు, ఈగలపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కి సంబంధించి రైతులు ఎవరు కూడా ఈ కేవైసీ కోసం సచివాలయం, రైతు సేవా కేంద్రానికి వెళ్ళనవసరం లేదని, గ్రామ వార్డు సచివాలయ శాఖ నుండి అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్‌కు రైతుల యొక్క డేటాని డైరెక్ట్ గా ఈ కేవైసీ చేసిన డేటాను అప్డేట్ చేశారు. కావున రైతులు ఎవరు కూడా సచివాలయం, రైతు సేవ కేంద్రానికి వెళ్ళన వసరం లేదు అని, ప్రభుత్వం వారు డైరెక్టుగా అనగా నేరుగా మీ యొక్క ఆధార్ అనుసంధాన బ్యాంకు ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ నగదును జమ చేస్తారని తెలిపారు. అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్ కొరకు కొత్తగా నమోదు చేసుకోడానికి త్వరలో అవకాశం ఇస్తారని ఇచ్చినప్పుడు రైతు సేవా కేంద్రానికి వెళ్లి నమోదు చేయించు కోవాల్సి ఉంటుందని ఆ విశాయాలను కూడా మా సిబ్బంది ద్వారా మీకు తెలియపర్చడం జరుగుతుందని తెలిపారు.

ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రస్తుతం పచ్చిరొట్ట విత్తనాలు అయినటువంటి జీలుగ,జనుము 50% రాయితీ పై రైతులకు అందుబాటులో ఉన్నాయయని కావల్సినటువంటి రైతులు రైతు సేవా కేంద్రానికి వెళ్లి నమోదు చేయించుకొని వినియోగించు కోవాలని ఆయన రైతులని కోరారు. మండల ఉద్యానవన శాఖ అధికారి(ఇంచార్జి) బి ధనలక్ష్మి మాట్లాడుతూ ఉద్యానవన శాఖలో ఉన్న పథకాల గురించి తెలియజేశారు. కొత్తగా కూరగాయలు సాగు చేసుకుంటే వాళ్ళకి ఒక హెక్టార్ కి రూ.24,000 సబ్సిడీ వస్తుందన్నారు. అదేవిధంగా పూల సాగుకు ఒక హెక్టార్ కి రూ.20,000 రాయితీ వస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యానవన సహాయకులు బి శ్రీలేఖ, ఆ గ్రామాల రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 17)

ఏపీ ప్రభుత్వం "సూపర్ సిక్స్" సంకల్పంతో ప్రారంభించిన తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి బడికి వెళ్లే విద్యార్థికి రూ.15,000 పంపిణీ చేస్తుంది. తల్లికి వందనం పథకం ప్రారంభంలో భాగంగా మండలంలోని మల్లవరం గ్రామంలో మంగళవారం మాదాలవారిపాలెం సొసైటీ ప్రెసిడెంట్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారెళ్ళ పద్మ, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# జులై 17న కారంచేడు నరమేధ స్మారక సభ

## 40 ఏళ్ల సందర్భంగా ఉద్యమ నేతలకు సన్మానం, పురస్కారాలు

## దళిత నేత నీలం నాగేంద్రరావు వెల్లడి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 17)

జులై 17న కారంచేడు దళిత నరమేద మారక సభను నిర్వహిస్తు న్నట్టు దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్ర రావు తెలిపారు. స్థానిక దళిత ఆకుల పరిరక్షణ సమితి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల కార్యక్రమంలో నీలం నాగేంద్రం మాట్లాడుతూ భారతదేశ దళితుల ఆత్మగౌరవ ప్రతిఘటన పోరాటంగా కారంచేడు దళిత నరమేధం చరిత్ర సృష్టించింది అన్నారు. కారంచేడు దళితుల రక్తం మడుగు నుండి దళిత ఉద్యమం ఆవిర్భవించిందన్నారు. భారత దేశంలో కారంచేడుకు ముందు తమిళనాడు బీహార్ రాష్ట్రాల్లో దళితుల ఊచ కోతలు దళిత పేటలు దహనాలు జరిగిన అవి కేవలం సంఘటనలుగానే మిగిలిపోయాయి అన్నారు. కాని 1985 జూలై 17న అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో కారంచేడు మాదిగలపై ఆ గ్రామ అగ్రకుల కమ్మ భూస్వాములు జరిపిన నరహంతక దాడి దళిత నేతలు కత్తి పద్మారావు, బొజ్జతారకం వాళ్ల ఆధ్వర్యంలో దళిత సంగ్రామ పోరాటంగా మారిందన్నారు. ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వియ్యంకుడైన దగ్గుబాటి చెంచురామయ్య కుట్రతో కారంచేడు కమ్మ భూస్వాములు వందలాదిమంది మారనా యుదలతో మారణ హోమం సృష్టించారన్నారు. కారంచేడు మాదిగ బాధితులకు చీరాల మాలలు 18 పేటలు ఏకమై పూటకో పేట నినాదంతో మాదిగలను అక్కున చేర్చుకొని ఆశ్రయం ఇచ్చారన్నారు. కత్తి పద్మారావు, బొజ్జతారకంల తదితరుల ఆధ్వర్యంలో చీరాలలో కారంచేడు మాదిగ బాధితులకు 436 మందికి ఇల్లు కట్టించి విజయనగర కాలనీగా ఏర్పాటు చేశారన్నారు. కారంచేడు దళితుల నరమేధంపై ప్రజా గాయకుడు గద్దర్ "దళిత పులులమ్మ" అంటూ నినదించిన పాట రాష్ట్రవ్యాప్తంగా జనగీతమైంది దళితుల చైతన్య గీతమై వాడ వాడల దళితుల సుప్రభాత గీతమైంది అన్నారు. ఆపద్బాంధవుడు సీనియర్ ఐఏఎస్ అధికారి శంకరన్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ను ఒప్పించి వందల మందికి ఉద్యోగాలు ఇప్పించారన్నారు. అంబేద్కర్ ఎజెండాగా దళిత ఉద్యమం కొనసాగుతుండగా కోర్టులు ప్రభుత్వాలు దళితులకు న్యాయం చేయలేవని పీపుల్స్ వారు పార్టీ 1987 ఏప్రిల్ 4న కారంచేడు దళిత మారణకాండ కి కుట్ర దారుడైన ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వియ్యంకుడైన దగ్గుబాటి చెంచురామయ్యను కారం చేడులోనే కాల్చి చంపారన్నారు. హరిజనులుగా, క్రైస్తవులుగా చలామణి అవుతూ కులం పేరు చెప్పుకోవడానికి సిగ్గుపడే మాలా మాదిగలు కారంచేడు మారణకాండ తర్వాత దళితులనే ఆత్మవిశ్వాసంతో జీవించారన్నారు. ఈ కారంచేడు నరమేధం భారతదేశ దళితుల ఆత్మగౌరవానికి ప్రతీకగా మారి చరిత్ర సృష్టించింది అన్నారు. అగ్రకుల రాజకీయ పార్టీల జెండాలు మోసే దళితుల ఆయా రాజకీయ పార్టీల ఎజెండాగా మార్చింది కారంచేడు ఉద్యమం అన్నారు. కులం పేరు చెప్పుకోవటానికి సిగ్గుపడే వారు నేడు ఆ కులాల పేర్లతో సంఘాలు పెట్టుకొని సగౌరవంగా జీవిస్తున్నారు. భారతదేశంలో వర్గ పోరాటాలే కానీ కులం లేదన్న కమ్యూనిస్టుల కళ్ళు తెరిపించింది కారంచేడు ఉద్యమమే అన్నారు. అంబేద్కర్ను లిబరల్ బూర్జువా అని వ్యతిరేకించిన నక్సలైట్ పార్టీలు సైతం నేడు అంబేద్కర్ సిద్ధాంత భూమికను అంగీకరించాయన్నారు. తాము పార్టీల్లో కూడా కుల నిర్మూలన, కుల వివక్ష అంటూ సంఘాలు పెట్టుకునే స్థాయికి తెచ్చింది కారంచేడు ఉద్యమన్నారు. కారంచేడు దళిత ఉద్యమ నిర్మాణ కర్తలైన కత్తి పద్మారావు, బొజ్జతారకం, గద్దర్ మరియు కారంచేడు ఉద్యమ కమిటీ కన్వీనర్ నిజాయితీకి మారు రూపమైన పోరాట యోధుడు తేల జడ్సన్ తదితర కుటుంబాలని ఆహ్వానిస్తున్నామన్నారు. అలాగే కారంచేడు ఉద్యమంలో జాతి కోసం శ్రమించి మరణించిన వారి మాలను కూడా సన్మానిస్తామన్నారు. వచ్చేనెల 17 ఒంగోలులో జరగనున్న నాలుగు దశాబ్దాల కారంచేడు నరమేధ ఉద్యమం మారక సభను జయప్రదం చేయాలని దళిత ఆకుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు దళిత బహుజనులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య కార్యదర్శి కాకుమాను రవి అంబేద్కర్ వేదిక కన్వీనర్ కసిగుర్తి రాజు, ఆనంద్ వీసీకే పార్టీ ఆదినారాయణ, అంబేద్కర్ వ్యవసాయ సంఘం జన్మాల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.




# మలేరియా నివారణ పై అవగాహన ర్యాలీ




(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 17)

పొదిలి అర్బన్ హెల్త్ సెంటర్ పీహెచ్సీ శరత్ చంద్ర ఆధ్వర్యంలో మలేరియా నివారణ మాసోత్సం సందర్భంగా మలేరియా నివారణ ర్యాలీ నిర్వహించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు మలేరియా వ్యాధి నియంత్రించేందుకు చేపట్టిన మలేరియా మాసోత్సవంలో భాగంగా పొదిలి అర్బన్ పీహెచ్సీలో ఆవరణలో రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు ఈ సందర్భంగా యుపీహెచ్సీ డాక్టర్ శరత్ చంద్ర మాట్లాడుతూ ముఖ్యంగా వర్షాకాలంలో వేగంగా వ్యాప్తి చెందే మలేరియా నివారించేందుకు ప్రతి ఒక్కరు మేల్కొని ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికి నీటి గుంతలు లేకుండా తక్షణమే పూచివేయాలని తెలిపారు. చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకూడదని వివరించారు. రాత్రి సమయాల్లో దోమల బారి నుంచి తప్పించుకునేందుకు దోమతెరలు వాడాలని సూచించారు. వేపాకు పోగ ద్వారా ఇంట్లోనే దోమలు రాకుండా నివారించవచ్చన్నారు. నీరు నిల్వ లేకుండా జాగ్రత్త తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుపీహెచ్సీ డాక్టర్ శరత్ చంద్ర, ఎస్యువీ కృష్ణయ్య, హెచ్ఎఎల్ శ్రీనివాస్రెడ్డి, ఎంఎల్హెచ్పీ, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థి దశలోనే భవిష్యత్‌పై అవగాహన పెంచుకోవాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 17)

విద్యార్థి దశలో ఉన్నప్పుడే భవిష్యత్తులో తమకు లభించే ఉద్యోగ, వృత్తిపరమైన అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా చెప్పారు. ఈ దిశగా ' ఉజ్వల భవిష్యత్తు ' పేరుతో విద్యార్థులకు అవగాహన కల్పించేలా " రూట్ టు రైజ్ త్రైవ్ ఫౌండేషన్ " జిల్లా బాలల వనరుల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక డిఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కెరియర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న మార్పులను నిరంతరం గమనిస్తూ ఉండాలని విద్యార్థులకు సూచించారు. పాఠాలతో పాటు పాఠ్యాంశేతర విషయాల్లోనూ విద్యార్థులు రాణించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఇలాంటి విషయాలపై అవగాహన కల్పించేందుకు ఈ కెరియర్ గైడెన్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. డివిజన్ల స్థాయిలోనూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. కాగా, వివిధ రంగాలలో అందుబాటులో ఉండే ఉద్యోగ అవకాశాలను తెలియజేసేలా ఏర్పాటుచేసిన స్టాల్స్ ను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఆయా విషయాలను వీటి నిర్వాహకులు ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. ఇంజనీరింగ్ , వైద్య , ఆర్థిక, న్యాయ, భారత నావికాదళం, పోలీసు, రైల్వే విభాగాల స్టాల్స్ తో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల స్పందన విభాగం వారు వివిధ పరికరాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యక్తిగత శుభ్రత, మంచి ఆహారపు అలవాట్ల పైనా ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ పి.డి. సువర్ణ, జిల్లా ఉప విద్యాధికారి చంద్రమౌళేశ్వర్, డిసిపిఓ దినేష్ కుమార్, బంగారు బాల్యం జిల్లా నోడల్ ఆఫీసర్ గిరిధర్ శర్మ, రూట్ టు రైజ్ త్రైవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు రషీద, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.














## యువకుడి ప్రాణాలు కాపాడిన ఎస్ఐ నరసింహారావు





(షణ్ముఖ వెలుగు, కంభం ,జూన్ 17)

మండలంలోని రావిపాడు గ్రామంలో ఓ యువకుడు తను ఆత్మహత్య చేసుకుంటున్నానని 100 కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. ఎస్పీ కార్యాలయం నుంచి కంభం పోలీస్ స్టేషన్ కి సమాచారం అందిన వెంటనే కంభం ఎస్ఐ నరసింహారావు తన సిబ్బందితో కలిసి వెంటనే రావిపాడు గ్రామంలోని యువకుడి ఇంటికి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్న వ్యక్తిని కాపాడి హుటాహుటిన పోలీసు వాహనంలో కంభం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 17)

కంభంపాడు గ్రామంలో ఖరీఫ్ 2025 సీజన్లో భాగంగా లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి పాపకుమారి మాట్లాడుతూ రైతులు అందరూ మెట్ట పంటలు వేసే ముందు పచ్చి రొట్టె పైరును వేసుకోవాలని తెలిపారు. అది కృత డీలర్ల దగ్గరే విత్తనాలు కొనుగోలు చేయాలని విత్తన బిల్లు అడిగి తీసుకోవాలని పంట కాలం పూర్తయ్యే వరకు బిల్లును భద్రపరుచుకోవాలని తెలిపారు. రైతులు సాగు చేసే పంటను రైతు సేవా కేంద్రంలో పంట నమోదు చేసుకోవాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంభంపాడు గ్రామ వ్యవసాయ సహాయకులు దొంగరి అనురాధ, ఖమ్మంపాడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ సాగుకు సమాయత్తం కావాలి





(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, జూన్ 17)

నూజెండ్ల మండలంలోని కమ్మవారిపాలెం, నూజెండ్ల రైతు సేవా కేంద్రాల్లో "పొలం పిలుస్తుంది" కార్యక్రమాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి యల్. ఎలీషా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పచ్చిరొట్ట పైర్ల సాగు వల్ల కలిగే లాభాలు, అలాగే ప్రైవేటు విత్తన వ్యాపారుల నుండి విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి మండలంలో 10,138 మంది రైతులు ఈ-కేవైసీ నమోదు చేసుకోగా, ఇప్పటివరకు 9,875 మంది రైతుల ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయిందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న 50% రాయితీతో జనుము, జీలుగా, పిల్లిపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లికి వందనం పై విషం చిమ్మడం విద్యార్థుల జీవితాలు హరించడమే

### యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, జూన్ 17)

తల్లికి వందనం పై విషం చిమ్మడం విద్యార్థుల జీవితాలను హరించడమేనన్న యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకంతో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తమఖాతల్లో నగదు పడడంతో ప్రతి తల్లి సంతోషంగా ఉందని ఎరిక్షన్ బాబు అన్నారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ తల్లికి వందనం పై బులుగు పార్టీ విషం చిమ్మడం సిగ్గుచేటన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి ఒక్కొక్కరికి 15000 రూపాయలు ఇస్తుంటే ఇచ్చిన మాట తప్పి ఒక్కరికి మాత్రమే అమ్మవడి ఇచ్చిన వైసిపి దీనిపై దుష్ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయడం చేతకాని వైసీపీ నేతలు లోకేష్ జేబులోకి 2 వేల రూపాయలు పోయాయని దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని మండి పడ్డారు. తల్లికి కూడా గౌరవం ఇవ్వలేని జగన్, ఆధారం లేని ఆరోపణలు చేస్తూ తల్లికి వందనం గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వైసిపి పాలనలో 42 లక్షల మంది పిల్లకు ఇస్తే కూటమి ప్రభుత్వం 67 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకాన్ని అందిస్తూ 8,700 కోట్ల రూపాయలను విడుదల చేసినట్టు



చెప్పారు. చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని ప్రతి తల్లి ఆనందం వ్యక్తం చేస్తుంటే జగన్ కు కడుపు మంటగా ఉందన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. కేజీ నుండి పీజీ వరకు చదివిస్తానని బడుగు బలహీన, మైనార్టీ లైన 12 లక్షల మంది విద్యార్థులను జగన్ మోసం చేశారన్నారు. ఇచ్చిన హామీని అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ,మంత్రి లోకేష్ చేస్తున్న కృషి కి ఇప్పుడు విద్యార్థుల తల్లులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అభివృద్ధితో పాటు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ పాలన కొనసాగిస్తుందన్నారు. ఎన్టీఆర్ భరోసా కింద 34 వేల కోట్ల రూపాయలను కూటమి ప్రభుత్వం కేటాయిస్తే వైసిపి ప్రభుత్వం కేవలం 21 వేల కోట్ల రూపాయల మాత్రమే కేటాయించిందన్నారు. అన్నదాత సుఖీభవ కింద కూటమి ప్రభుత్వం 14 వేల కోట్ల రూపాయలను కేటాయిస్తే వైసిపి ప్రభుత్వం 7000 కోట్ల రూపాయలను మాత్రమే కేటాయించిందన్నారు. కూటమి ప్రభుత్వం దీపం పథకానికి 2,650 కోట్లు, మత్స్యకారుల సేవలో 259 కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. వైసిపి నాయకులు తల్లికి వందనం పథకం పై చేస్తున్న తప్పుడు ప్రచారాని ఆపాలని లేకుంటే తగిన బుద్ధి చెబుతామని ఎరిక్షన్ బాబు హెచ్చరించారు.

# పారిశుద్ధ్యం పట్ల అలసత్వం వహించరాదు

### మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 17)

పారిశుద్ధ్యం పట్ల అలసత్వం వహిస్తే ప్రభుత్వ పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. మంగళవారం కనిగిరి పట్టణంలోని ఒకటవ వార్డులోని శివనగర్ కాలనీలో ప్రజలు ఫిర్యాదు మేరకు మున్సిపల్ అధికారులతో కలసి ఆయన పర్యటించారు. అనంతరం ప్రజలు నుండి సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకోగా వార్డులో సైడు కాలువల్లో పూడిత చెత్త చెదారంతో దుర్వాసన వస్తున్నదని ఫిర్యాదు చేయగా వెంటనే మున్సిపల్ అధికారుల పిలిపించి పనితీరుపై అగ్రహా వ్యక్తం చేశారు.మున్సిపల్ కార్మికులచే అపరిశుభ్రమైన ప్రాంతాన్ని పరిశుభ్రము చేయించ్చారు.పట్టణంలో ఎక్కడ కూడా అపరిశుభ్రంగా ఉండ కుండా చూడాలని ప్రజలు నుండి ఫిర్యాదులు వచ్చినట్లయితే సహించేది లేదన్నారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వార్డులలో పారిశుద్ధ్యం పట్ల నిర్లక్ష్యం చేయరాదని,ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహించరాదని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.ఆరోగ్య సిబ్బంది డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలు పట్ల నిర్లక్ష్యంగా ఉండి ప్రజలకు పరిసరాలు పరిశుభ్ర త గురించి అవగాహన కల్పించక పోతే విష జ్వరాలైన డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పారిశుద్యం ఆరోగ్యం, జీవన ప్రమాణాలకు సంబంధించినది కాబట్టి ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## నీట్ 2025లో మెరిసిన ప్రకాశం జిల్లా నారాయణ విద్యార్థులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 17)

ఇటీవల విడుదలైన నీట్ 2025 ఫలితాల్లో ప్రకాశం జిల్లా నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు కే హర్షిని 4341, ఎం సాయి విజయ్ చైతన్య 4996, ర్యాంకులు సాధించారని అన్ని కేటగిరీలలో 7గురు మంచి ర్యాంకు సాధించి మెడికల్ విద్య అభ్యసించేందుకు అర్హతకు పొందినట్లు ప్రకాశం జిల్లా నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న విద్యా సంవత్సరంలో మరింత మంది విద్యార్థులు ర్యాంకులు సాధించేలా ప్రణాళిక రూపొందించి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ర్యాంకులు పొందిన విద్యార్థులను డీన్ మధుసూదన్‌రెడ్డితో పాటు ఏజీఎం మురళి, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు ఎన్ సుజాత, అధ్యాపకులు అభినందించారు.

# యోగా శిక్షణ పై దృష్టి సారించాలి

### పాఠశాల విద్య కమిషనర్ వి విజయరామరాజు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 17)

ఈ నెల 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనే విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించాలని పాఠశాల విద్య కమిషనర్ వి విజయరామరాజు చెప్పారు. మంగళవారం రాష్ట్ర కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ.తమీమ్ అన్సారియాతో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయరామరాజు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో ఈనెల 18, 19, 20 తేదీలలో ప్రతిరోజు సాయంత్రం ఒక గంట సేపు యోగాసనాలు సాధన





చేయించాలని చెప్పారు. ఆయా విషయాలపై మండల స్థాయి ప్రత్యేక అధికారులతో టెలి కాన్ఫరెన్ నిర్వహించి దిశా నిర్దేశం చేయాలని కలెక్టర్లకు సూచించారు. డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, జెడ్పి సీఈవో చిరంజీవి, ఆయుష్ విభాగ సీనియర్ వైద్యులు భీమ్ నాథ్, డిప్యూటీ జిల్లా విద్యాధికారి చంద్రమౌళీశ్వర్, ఇతర అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు.

# కొల్లూరుపాడు, రాజుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది

## వ్యవసాయ అధికారి డి విజయ్ కుమార్




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 17)

మండల కేంద్రమైన ఉలవపాడు 1, 2 రైతు సేవ కేంద్రం పరిధిలోని కొల్లూరుపాడు, రాజుపాలెం గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి విజయ్ కుమార్ మాట్లాడుతూ రైతు లకు 50 శాతం రాయితీ పై జీలుగలు, జనములు పంపిణీ చేయటం జరుగుతుందని తెలియజేశారు. ఖరీఫ్ సీజన్లో పచ్చిరొట్ట పైర్లుగా సాగు చేసుకునేందుకు రైతులకు ఉపయోగపడతాయి అన్నారు. పచ్చిరొట్ట పైర్లను విత్తుకొనుటకు ప్రస్తుత ఉన్న వాతావరణం సరైనదన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దుక్కులు దున్నుకొని పచ్చి రొట్ట ఎరువు పంటలను సాగు చేయాలని సూచించారు. పచ్చిరొట్ట పైర్లను సాగు చేయడం వలన నేల గుల్లగా మారి నీరు ఇంకె గుణం పెంచుతుందన్నారు. నెలలో దీనివలన సూక్ష్మజీవులు పెరిగి జీవ రసాయనక చర్యలు జరగడం వలన నేలలో సారం పెరిగి ఉత్పాదకత సారం పెరుగుతుందన్నారు. జీలుగా ఒక కిలో ధర.రూ.51.50లు కాగా జనుములు ఒక కిలో ధర రూ.54.50లుగా, రైతు వాటాగా చెల్లించాలని తెలిపారు. వీటి సాగువలన భూమిలోని సేంద్రియ కర్బనశాతం పెరుగుతుందని తెలిపారు. ఒక ఎకరాకు జనుములు 10 కేజీలు, ఒక ఎకరాకు జీలుగులు 10 కేజీలు, ఒక ఎకరాకు పిల్లి పెసర 8 కేజీలు ఇవ్వడం జరుగుతుందన్నారు. విత్తనాల కొరకు రైతులు తమ ఆధార్ కార్డు, పొలం పట్టాదారు పాస్ పుస్తకం, ఫోన్ నెంబరు తీసుకొని మీ గ్రామాల్లో గల రైతు సేవ కేంద్రాలకు వెళ్లి పర్మిట్లు రాయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి డి. విజయ్ కుమార్ రైతులు పాల్గొన్నారు.




# ప్రపంచ శాంతిని నెలకొల్పాలి

### వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ దగ్గర నుంచి అద్దంకి బస్టాండ్ వరకు ర్యాలీ







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 17)

ఇరాన్ పై ఇజ్రాయిల్ దాడిని వ్యతిరేకిస్తూ ఇజ్రాయిల్ జాతి విధ్వంసాలను వ్యతిరేకంగా పాలస్తీనకు మద్దతుగా యుద్ధం ఆపాలని, ప్రపంచ శాంతిని నెలకొలపాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ దగ్గర నుండి అద్దంకి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి అద్దంకి బస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమం తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు సిపిఎం జిల్లా నాయకులు జి రమేష్ అధ్యక్షతన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు మాట్లాడుతూ జూన్ 13వ తేదీ తెల్లవారు జామున ఇరాన్‌లోని అనేక నగరాల పై ఇజ్రాయిల్ క్షిపుణులు, డ్రోన్‌లతో దాడులు నిర్వహించింది. ఈ దాడులలో వేల మంది చనిపోయారని వెస్ట్ బ్యాంక్ ప్రాంతాల నుంచి పాలస్తీనులను వెల్లగొట్టడం లక్ష్యంగా అమెరికా అండ దండలతో ఇరాన్ పై ఇజ్రాయల్ దాడులు జరుగుతున్నాయని, ప్రధానంగా సైనిక కమాడర్లు అణు శాస్త్రవేత్తల నిర్మూలించడం లో అమెరికా ఇజ్రాయిల్ మధ్య సన్నిహిత సహకారం ఉందని అనేక నివేదికలు ఉన్నాయి. వాటిలో దాడికి 24 గంటలు ముందు ఇరాన్ సమీపంలో పనిచేస్తున్న ఇంధనం నింపే ట్యాంకర్లు ఉన్నాయని అమెరికన్ సహకారం లేకుండా ఇజ్రాయిల్ ఇరాన్ పై దాడి చేయలేదు. ట్రంపు ప్రభుత్వం ఇరాన్‌తో అను కార్యక్రమం పై చర్చలు జరుపుతోంది జూన్ 13న ఉమెన్ లో సమావేశం జరగనుందన్నారు. యుద్ధం ఆపాలని ప్రపంచశాంతి నెలకొల్పాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఐఎంఎల్ నాయకులు సాయి, న్యూ డెమోక్రసీ నాయకులు చిటపట వెంకటేశ్వరరావు, కంకణాల ఆంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, ఇన్సాఫ్ నాయకులు ఎంఎ సలర్, రైతు సంఘం నాయకులు బాలకోటయ్య, పిఓడబ్ల్యు పద్మ, ఆర్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## జూదరులు అరెస్ట్

## రూ.16,540 నగదు స్వాధీనం

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 17)

మండలంలోని మాలపాడు గ్రామ శివారులో కోతముక్క ఆడుతున్న కొంతమంది పై పోన్నలూరు ఎస్ఐ అనుక్ సిబ్బందితో కలిసి మెరుపు దాడి చేసి ఇద్దరు వ్యక్తులను పట్టుకొని, వారి వద్ద నుండి 16,540 రూపాయల నగదు, పేకముక్కలను స్వాధీన పరుచుకున్నారు. అనంతరం వారిని సింగరాయకొండ కోర్టులో హాజరు పరచనున్నారు.

# ఉపాధి కూలీల బిల్లుల చెల్లించాలని ధర్నా

(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జూన్ 17)

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హనుమంతుని పాడు మండల అభివృద్ధి కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ గత మూడు నెలలుగా కూలీలు పనులు చేస్తుంటే బిల్లులు చెల్లించకుండా అర్ధాకులతో చంపడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రస్తుతం పని చేస్తున్న కూలీల గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని పనిముట్లు ఇవ్వాలని మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పని చేసే క్రమంలో చిన్నపాటి దెబ్బ తగిలిన కనీసం కట్టుగుడ్డబోతమందు కూడా ఇవ్వకుండా కూలీల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలందరికీ ఉచిత భీమా సౌకర్యం కల్పించాలని మజ్జిగ, మంచినీళ్లు, పనిముట్ల బాడుగలు, రవాణా బాడుగ చెల్లించాలని కోరారు. మేట్లను ఏర్పాటు చేయటంతో పాటు మేట్లకు అదనపు పారితోషకం ఇవ్వాలని, సమ్మర్ స్పెషల్ ఆధారంగా ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బిల్లులు రాకపోవడంతో కూలీలు పనికి రావడం తగ్గిపోయిందని ప్రభుత్వం పని చేస్తే డబ్బులు రావడం లేదని అటువంటి పరిస్థితులు నుండి కూలీలకు భరోసా కల్పించాలన్నారు. అందుకొరకై తక్షణమే 9 నెలల బిల్లులు వెంటనే విడుదల చేసి కూలీలకు ఆదుకోవాలని ఆలస్యానికి అదనంగా రుసుము చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మేట్లు కత్తి సామేలు, బాలయ్య, గురుస్వామి, రమణారెడ్డి, ఏసు, ఇజ్రాయిల్, ప్రభాకర్‌రెడ్డి, కత్తి ఏబు, రాములు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. ధర్నాకు హనుమంతునిపాడు మండల కేంద్రం సర్పంచ్ కత్తి రాజారావు సంఘీభావం తెలిపారు. ఎంపీడీవో రంగ సుబ్బారాయుడు మాట్లాడుతూ వారంలోపు ఉపాధి కూలీలందరికీ బిల్లులు పడే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని, త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని హామీ ఇచ్చారు.



# సంక్షేమ పథకాలు అమలు చేయడంలో టిడిపి చరిత్ర సృష్టించింది

### జిల్లా ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 17)

సంక్షేమ పథకాలు అమలు చేయడంలో టిడిపి పెట్టింది పేరు అని రసూల్ మహమ్మద్ తెలిపారు. ఆనాడు అన్న ఎన్టీఆర్ కిలో రెండు రూపాయలు బియ్యంతో సంక్షేమ పథకంతో చరిత్ర సృష్టిస్తే ఈసారి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తల్లికి వందనం అనే సంక్షేమ పథకాన్ని అమలు చేసి నారా చంద్రబాబు నాయుడు మరో చరిత్ర సృష్టించారన్నారు. సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం అనే సంక్షేమ పథకాన్ని అమలు చేసి చూపించారన్నారు. ఆనాడు జగన్ ప్రభుత్వం నాలుగేళ్లలో వేసిన అమ్మ ఒడి ఈ రోజు కూటమి ప్రభుత్వం ఒకే సంవత్సరంలో తల్లికి వందనం వేసి చూపించారన్నారు. ఈ రోజు తల్లుల కళ్ళల్లో ఆనందాన్ని కూటమి ప్రభుత్వం చూడగలిగిందన్నారు. పిల్లల్ని చదివిస్తే ఈ రాష్ట్రానికి అతిపెద్ద సంపద వారేనని నమ్మి ఆచరణలో పెట్టి చూపిస్తున్నారు సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఒక్కొక్కటిగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే బులుగు బ్యాచ్ కూటమి ప్రభుత్వం పై విషం కక్కుతుందన్నారు. కడుపు మంటతో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. 2000 రూపాయలు లోకేష్ బాబు జేబులోకి పోయాయంటూ వైసీపీ నేతలు దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం వైసీపీ పాలనలో రూ.13,000 ఇచ్చారంటే 2000 జగన్ జేబులోకి పోయినాయా? లేదంటే తాడేపల్లి ప్యాలెస్‌కు పోయాయా అని ఈ సందర్భంగా రసూల్ మహమ్మద్ ప్రశ్నించారు? గత ప్రభుత్వం జగన్ పాలనలో 47 లక్షల మందికి అమ్మఒడి ఇస్తే చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం 67 లక్షల మందికి ఈ పథకం లబ్ధి చేకూరిందన్నారు అయితే గత ప్రభుత్వంలో కుటుంబంలో ఇద్దరు పిల్లలుంటే ఇద్దరు పిల్లలకి అమ్మఒడి అమలు చేస్తానని చెప్పి కుటుంబంలో ఒక్కరికే అమ్మ ఒడి అమలు చేసి మధ్య తరగతి కుటుంబాలను మోసం చేసిన ఘనత జగన్ కి దక్కుతుందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధిని చూసి జగన్ మోహన్‌రెడ్డి తప్పుడు ప్రచారాలు చేయడం జగన్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శమన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు ఇలాంటి తప్పుడు ఆరోపణలు మానుకోవాలని రసూల్ మహమ్మద్ హితువు పలికారు.

# జిల్లాలో అన్ని పాఠశాలలను యోగశాలలుగా మార్చాలి

### విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జూన్ 17)

జిల్లాలో అన్ని పాఠశాలలను యోగ శాలలుగా మార్చాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు జిల్లా కలెక్టర్లకు సూచించారు. మంగళవారం అమరావతి సచివాలయం నుండి పాఠశాల విద్యశాఖ డైరెక్టర్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది, పదవ తరగతి, ఐటిఐ, ఇంటర్మీడియట్, డిగ్రీ అపై విద్యార్థులు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేటట్లు చూడాలన్నారు. జూన్ 21న అన్ని విద్యాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి సంబంధించి ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని సచివాలయల్లో యోగాంధ్ర కార్యక్రమలు నిర్వహించాలని చెప్పారు. ఈ నెల 17,18,19 తేదిలలో విద్యార్థులకు యోగ పై ట్రైనింగ్ ఇవ్వా లన్నారు. ట్రైనింగ్ అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్ మంజూరు చేయాలన్నారు. తల్లికి వందనం అందని కుటుంబాలకు టెక్నికల్ సమస్యలు ఎదురైతే క్లియర్ చేసే విధంగా అధికారులు సూచనలు చేయాలని ఆయన చెప్పారు. బాపట్ల జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పరిమితికి మించి గ్రానైట్, కంకర, గ్రావెల్‌ను ఓవర్‌లోడ్ చేసి నడపరాదు

### ఒంగోలు రవాణా కమీషనర్ ఆర్ సుశీల





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 17)

ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఉత్తర్వుల మేరకు మంగళవారం ఒంగోలు రవాణా కమీషనర్ ఆర్.సుశీల వారి అధ్యక్షతన వారి ఛాంబర్ నందు టిప్పర్, భారీ వాహనాల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రాజశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ అండ్ జియాలజి, ఒంగోలు, బి. రామచంద్ర, అసిస్టెంట్ డైరెక్టర్ (అర్.వి.ఎస్) మైన్స్ అండ్ జియాలజి, మోటార్ వాహన తనిఖీ అధికారులు, సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారులు హాజరయ్యారు. ఉప రవాణా కమీషనర్, డిడి మైన్స్ జియాలజి వారు టిప్పర్, భారీ వాహన యజమానులతో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ పరిమితికి మించి గ్రానైట్, కంకర, గ్రావెల్ తదితర వస్తువులను ఓవర్లోడ్ వేసి వాహనములను నడపరాదని, అలాగే రహదారి భద్రతా నియమాలను ఖచ్చితముగా పాటించాలని కోరారు. అందుకు టిప్పర్, భారీ వాహన యజమానులు తమ సుముఖతను వ్యక్తపరిచారు. ఉల్లంఘించిన యెడల కేసులు నమోదు చేసి వాహనం సీజ్ చేస్తామని వాహనదారులను హెచ్చరించారు.

# నూతన కమిటీకి అభినందనలు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 17)

ప్రకాశం జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా కోశాధికారిగా రాచర్ల శేఖర్, మహిళా కమిటీ అధ్యక్షులుగా సామంతపూడి విజయలక్ష్మిలను నియమిస్తూ ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసచారి ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ తమ పై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పజెప్పినందుకు సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, జిల్లా కమిటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. పొదిలి శేఖర్ టింబర్ డిపో వద్ద పదవులు పొందిన రాజశేఖర్, విజయలక్ష్మిలను పొదిలి విశ్వ బ్రాహ్మణ సంఘ నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుత్తికొండ కళ్యాణ్, ఉప్పులురు బాబు, నిమ్మల సూర్యం, సామంతపూడి బాలసుబ్రమణ్యం, సంఘ నాయకులు పాల్గొన్నారు.

# హెల్త్ సెంటర్ రూంను పరిశీలించిన డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ సృజన






**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 17)**

డిప్యూటీ డిఎంఅండ్హెచ్ఓ మంగళవారం హెల్త్ సెంటర్ ఏర్పాటు కోసం రూంను పరిశీలించారు. సృజన మాట్లాడుతూ హెల్త్ సెంటర్ ఏర్పాటుకు గ్రామస్తులు సహకరించి వారు కోరుతున్న ప్రదేశంలో ఉన్న రూమును బాగు చేయించి అందుబాటులోకి తీసుకొని వస్తే హెల్త్ సెంటర్ ను ఏర్పాటు చేయగలమని గ్రామస్తులకు సూచించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మండల సమస్యలపై సదస్సు నిర్వహించినప్పుడు గ్రామస్తులు స్థానిక సత్రం వద్ద హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీనిపై సృజన సూచన మేరకు గ్రామస్తులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు కృష్ణ చైతన్య, రవి కిరణ్, గ్రామస్తులు మండవ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు రైతు సదస్సు జయప్రదం చేయండి



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 17)**

పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ధరల సమస్యల గురించి ఈనెల 20వ తేదీన ఒంగోలు మల్లయ్య లింగం భవనంలో జరిగే పొగాకు రైతు సదస్సును జయప్రదం చేయాలని నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణంలోని 26వ వేలం కేంద్రంలో పొన్నలూరు మండలంలోని తిమ్మపాలెం క్లస్టర్ రైతులతో, వేలం నిర్వహణ అధికారులు పొగాకు వ్యాపారస్తులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వీరారెడ్డి, సిపిఐ నియోజవర్గ కార్యదర్శి బూచి సురేష్ ఆనందమోహన్ తదితరులు మాట్లాడుతూ ఒంగోలులో జరిగే పొగాకు రైతు సదస్సును జయప్రదం చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు రైతులు, టొబాకో బోర్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈకేవైసి పూర్తి కాని వారికి మరల అవకాశం



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 17)**

పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా పచ్చి రొట్టె ఎరువులు ,భూసార పరీక్షలు, కౌలుకు వేసుకునే రైతులు కౌలు రైతు కార్డును వీఆర్వోల ద్వారా తీసుకోవాలని, అన్నదాత సుఖీభవ ఈ కే వై సి కూడా పీ4 సర్వే ద్వారా ఆటోమేటిగా ఈ కే వై సి పూర్తి అవ్వడం జరిగింది. అదే విధంగా ఈ కే వై సి పూర్తి కాని వారికి కూడా మరల అవకాశం ఇవ్వడం జరుగుతుందనీ మార్కాపురం ఏ. ఓ బుజ్జి బాయ్ తెలిపారు. మంగళ వారం మండలంలోని ఇడుపూర్, బోడపాడు గ్రామాల యందు పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి బుజ్జి బాయ్ నిర్వహించడం జరిగింది. ఆ కార్యక్రమం ఏవో మాట్లాడుతూ రైతులు అందరూ పచ్చి రొట్టె ఎరువులు, భూ సారా పరీక్షలు, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌కు ప్రతి రైతు రైతు సేవా కేంద్రానీ కి వెళ్లి ఈ కే వైసీని సద్వినియోగించుకోవాలనీ కోరారు. కార్యక్రమంలో మార్కాపురం మండల నాయకులు జవ్వాజి రామాంజుల రెడ్డి, ఇడుపూర్, బోడపాడు రైతు సేవా కేంద్రం సిబ్బంది సాయి రామ్, పవనేశ్వరి, ఆయా గ్రామాల్లో రైతులు పాల్గొన్నారు .

# చరిత్రలో నిలిచిపోయేలా యోగాంధ్రకు ఏర్పాట్లు

## ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

## యోగాంధ్ర పై విశాఖ వీఎంఆర్డీఏ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమావేశం

## మంత్రులు అచ్చెన్నాయుడు, డోలా, అనగాని, అనిత, బీసీ జనార్దన్‌రెడ్డి హాజరు



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 17)**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2025 చరిత్రలో నిలిచి పోయేలా ఏర్పాట్లు ఉండాలని అధికారులకు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, పోలీసు సహా స్థానిక యంత్రాంగం, రాష్ట్రస్థాయి అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. విశాఖలో ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర -2025 కార్యక్రమం పై మంగళవారం విశాఖ వీఎంఆర్డీఏ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, డోలా బాలవీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగానే ఈ కార్యక్రమానికి భీమిలి నియోజకవర్గం పరిశీలకుడిగా కూడా ఉన్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ యోగాంధ్ర-2025 కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రతిష్ఠను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పే అవకాశంగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలోనే అన్ని విభాగాల సమన్వయంతో, ముఖ్యంగా స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేయడం ద్వారా ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందని సూచించారు. మరీ ముఖ్యంగా యువత, విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని, యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు. భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల సౌలభ్యం కోసం అధికారులు, పోలీసు శాఖ కలిసి సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ అంశాలన్నిటి పై సుదీర్ఘంగా చర్చించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు సమన్వయంలో ఎలాంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా ముదుకు సాగాలని నిర్ణయించారు. ప్రజలందరి భాగస్వామ్యంతో యోగాంధ్రకు మరింతగా ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు.



# ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం

## నూతన కమిటీ కార్యవర్గ సమావేశం







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 17)**

ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీ కార్యవర్గ సమావేశం ఒంగోలు నగరంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘంభవన్‌లో జరిగింది. నూతన జిల్లా అధ్యక్షులు పీఎస్ బాబు ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. కమిటిలలో గౌరవ అధ్యక్షుడిగా చేలికిచర్ల ప్రకాష్, జనరల్ సెక్రెటరీగా నొస్సం నాగేంద్రచారి, కోశాధికారిగా పావులూరి బ్రాహ్మణచారి, అధికార ప్రతినిధిగా నూతక్కి వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కీనల శ్రీనివాసచారి మరి కొంతమంది సంఘీయులని ఏడు నియోజకవర్గాల నుంచి జాయింట్ సెక్రటరీలుగా ఉపాధ్యక్షులుగా కార్యవర్గ సభ్యులుగా, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలుగా వినుకొండ శ్యామలను, జిల్లా యువజన విభాగంలో జిల్లా అధ్యక్షులు పత్తిపాటి కార్తీక్ ని సెక్రెటరీగా నూతక్కి సాయిరాంని ప్రకటించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ అసిస్టెంట్ కమిషనర్ కిరణ్ కుమార్‌ను సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అనేది బలోపేతంగా ఉండాలని పదవులు తీసుకున్నవారు సంఘ పురోభివృద్ధికి పాటుపడాలని, సంఘయులు అందరితో కలుపూగోలుగా ఉండాలని వారికి అండగా ఉండాలని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు పీఎస్ బాబు మాట్లాడుతూ గవర్నమెంట్ స్కూల్లో 400 పైన మార్కులు వచ్చిన టెన్త్ క్లాస్ స్టూడెంట్సకి ఇంగ్లీషు తెలుగు డిక్షనరీ, వెయ్యి రూపాయలు నగదు అందజేయడానికి చోడా నాగేశ్వరరావు, యు లావణ్య, నాగభూషణాచారి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం చాలా గర్వకారణంగా ఉందన్నారు. ఈనాటి విద్యార్థులే రేపటి భవిష్యత్తు కాలానికి మాణిక్యాలని ప్రస్తావించారు. దీనికి సహకరించిన దాతలు సంఘయులు అందరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

# విజయనగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్ల పై నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 17)**

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జూన్ 21న విశాఖపట్టణంలో నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లపై విజయనగరం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, ఇతర ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# వ్యవసాయ పథకాల పై రైతులకు అవగాహన

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 17)**

వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మంగళ, బుధ వారాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు శాస్త్రవేత్తలు అందరూ ఒకే వేదిక మీదకు వచ్చి రైతులకు ప్రభుత్వ పథకాలు మరియు సబ్సిడీలు, అవగాహన కల్పించి, సాంకేతిక సమాచారం అందించి, క్షేత్ర స్థాయిలో తక్షణం పరిష్కారం సూచించడమే దీని యొక్క ఉద్దేశం అని తెలియజేసారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ నుంచి రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు జనములు 80 క్వింటాలు అందుబాటులో ఉన్నాయని పూర్తి ఖరీదు కేజీ రూ 109.00, రైతు కట్టవలసినది 50శాతం రాయితీతో రూ. 54.50 అని, కావలసిన రైతులు మీ సంబంధిత రైతు సేవా కేంద్రాలలో పేరు నమోదు చేసుకోని నగదు చెల్లించాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద మీ పేరు జాబితా లో ఉండి,ఈ కే వై సి చేసుకోని రైతులు 19 తేదీ లోపల సంబంధిత రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి చేసుకోవాలని సూచించారు.






మండల పశు వైద్యాధికారి డా.జే.శివరామ క్రిష్ణ మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖలో అమలవుతున్న గోకులం షెడ్లు, పశువుల బీమా, పశు గ్రాసాల పెంపకం, రాయితీ పై ఇచ్చే దానా గురించి వివరించారు. కావున రైతులందరూ అన్నీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పొన్నలూరు గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ సబీహా, గ్రామ పెద్దలు మండవ ప్రసాద్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com